క్లుప్తంగా

పొలం రస్తా వివాదంలో కందిపంట ధ్వంసం



పొలాన్ని దున్నేసిన దృశ్యం

గుంతకల్లు రూరల్: అన్నదమ్ముల పొలం రస్తా వివాదంలో సాగుచేసిన కందిపంటనే దున్నేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దోసలుడుకి గ్రామానికి చెందిన హనుమక్కకు కుమారులు నాగేంద్ర, నాగరాజు, నాగప్ప ఉన్నారు. హనుమక్క తనకున్న మూడు ఎకరాల పొలాన్ని తలా ఒక ఎకరా చొప్పున పంపకాలు చేసింది. ఈ క్రమంలో వీరిమధ్య ఏర్పడిన రస్తా వివాదం గత కొంత కాలంగా కొనసాగుతుంది. 15 రోజుల క్రితం నాగరాజు తనకున్న ఎకరాలో రూ.15 వేలకు పైగా ఖర్చు పెట్టి కందిపంటను సాగుచేశాడు. శుక్రవారం నాగరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల శుభకార్యంలో పాల్గొనేందుకు వేరే ఊరికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి సాగు చేసిన కందిపంటను అతడి అన్న నాగేంద్ర కుమారులైన రాజు, ధనుంజయ ట్రాక్టర్‌తో దున్నేశారు. వారిపై బాధిత రైతు కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమ్మె కొనసాగిస్తాం



దీక్ష చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్, సహాయ కార్యదర్శి సురేంద్ర హెచ్చరించారు. సమ్మెలో భాగంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి ఏడో రోజుకు చేరుకున్నారు. 20 రోజులుగా కార్మికులు నిరసన బాట పట్టినా ప్రభుత్వం వేతనాలు పెంచకుండా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ప్రభుత్వం కార్మిక జేఏసీ నేతలతో చర్చించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, మస్తాన్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి

పెద్దవడుగూరు: కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఉషారాణి సూచించారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో 48,27,29 నంబర్ రేషన్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంపిణీ చేసిన సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎంత మంది వృద్ధులు, వికలాంగులు ఉన్నారనే సమాచారం తెలుసుకుని వారి ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు ఇంటి వద్దకు అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. ఎవరైనా డీలర్లు లబ్ధిదారులకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ లహరిక, వీఆర్వో సుదర్శన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా చేసుకోండి

యల్లనూరు: మండల వ్యాప్తంగా మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని ఎస్ఐ రామాంజనేయరెడ్డి సూచించారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ పీర్ల పండుగను గ్రామాల్లో ముస్లిం మత పెద్దలు, హిందువులు ఐకమత్యంతో నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ఏవైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్దపప్పూరు: మొహర్రం ఉత్సవాల నిర్వహణ కోసం ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



నరసింహ



కిరణ్



సాయి ధీరజ్



వైష్ణవి

గుత్తి: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రతిష్ట కుమారి శనివారం తెలిపారు. నరసింహ, కిరణ్, సాయి ధీరజ్, వైష్ణవి ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీ కాలేజీలకు సెలెక్ట్ అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మార్కెట్ యార్డులో సమస్యల తిష్ట

- గోడౌన్‌ల అద్దెలో రైతులకు మొండిచేయి
- కొత్త కమిటీపై మీనమేశాలు
- పట్టించుకోని అధికారులు



తాడిపత్రిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి మార్కెట్ యార్డు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ యార్డును రూపుదిద్దడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు ప్రైవేట్ వ్యాపారులకు గోడౌన్లను అద్దెకివ్వడంలో ఆసక్తి చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రైతులు పండించిన పంటను గోడౌన్లల్లో గిట్టుబాటు ధర వచ్చేవరకూ నిల్వ చేయించి వారికి రైతు బంధు పథకం కింద కొంత మేరకు అడ్వాన్స్ రూపంలో డబ్బు ఇచ్చి ప్రోత్సహించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో రైతులు ప్రైవేట్ గోడౌన్లపై ఆధారపడాల్సి వస్తోంది. మూడు జిల్లాల కేంద్రంగా ఉన్న యార్కెట్ యార్డు రైతులకు బదులు ప్రైవేట్ వ్యాపారులకు ఉపయోగపడుతోంది. ఇక్కడ కేవలం రైతుల కోసం మాత్రమే ఉపయోగించాల్సిన మార్కెట్ యార్డులోని బిల్డింగ్‌లు ప్రైవేట్ వ్యాపారస్థుల గోడౌన్‌లకు ఉపయోగపడుతుండటం పలు విమర్శలకు తావిస్తోంది. మార్కెట్ యార్డులో కాకుండా బయట బిల్డింగ్‌లను గోడౌన్‌లుగా ఉపయోగించుకోవాలంటే పెద్ద మొత్తంలో చెల్లించాల్సి ఉండగా ఇక్కడ మాత్రం చౌకగా లభిస్తుంటంతో ఉపయోగించుకుంటున్నారు. మార్కెట్ యార్డులో శ్రీ శివరాఘవేంద్ర ఎలక్ట్రానిక్‌కు చెందిన గూడ్స్ పెద్ద ఎత్తున నిల్వ చేశారు. మరో బ్రోకర్ సైతం రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటను గోడౌన్‌లో చేసుకొని ధర వచ్చేంతవరకూ నిల్వ చేసుకుని అనంతరం విక్రయాలు జరుపుతూ పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్ యార్డులో ప్రస్తుతం ఆర్టీఓ కార్యాలయం, ఐటీఐ కళాశాల, హౌసింగ్ గోడౌన్, సీపీఐ గోడౌన్‌లు ఉన్నాయి. మార్కెట్ యార్డుకు చెందిన గోడౌన్లతో పాటు 70 వరకూ దుకాణాలు ఉన్నాయి. మార్కెట్ యార్డుకు విధించిన టార్గెట్‌లో వీటి ద్వారా వచ్చే అద్దెల ఆదాయం కూడా ఎక్కువ ఉంటోంది.

ఖాళీగా ఉన్న పోస్టులు

మార్కెట్ యార్డులో మొత్తం 19 పోస్టులకు గాను కొంత మందిని మాత్రమే భర్తీ చేశారు. మిగిలిన పోస్టుల భర్తీలో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోంది. సూపర్‌వైజర్లు రెండు పోస్టులు, జేఎంఎస్ రెండు, అటెంటర్లు నాలుగు, వాచ్‌మెన్లు ఐదు, ఒక్కొక్కరు చొప్పున అసిస్టెంట్ సెక్రటరీ, టైపిస్టు పోస్టులు ఖాళీఉన్నాయి. ఆ స్థానంలో ఎనిమిది మంది కాంట్రాక్ట్ సిబ్బందిని తీసుకొని వారితో మిగిలిన వారి విధులను కేటాయించారు. గతంలో తాడిపత్రి మార్కెట్ యార్డు పరిధిలో తాడిపత్రి మండలం బుగ్గ, యాడికి మండలం రాయలచెరువులో చెక్‌పోస్టులు ఉండేవి. సిబ్బంది కొరత కారణంగా బుగ్గ వద్ద చెక్‌పోస్టును ఎత్తివేసి అవసరమైనప్పుడు తాత్కాలిక చెక్‌పోస్టును ఏర్పాటు చేసుకుంటున్నారు.

కొత్త కమిటీ నియమాకంలో జాప్యం

కూటమి ప్రభుత్వం తాడిపత్రి మార్కెట్ యార్డుకు కొత్త కమిటీ ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా కొత్త కమిటీ ఏర్పాటుపై నిర్లక్ష్యం చేస్తోంది. కమిటీ చైర్మన్‌తోపాటు సభ్యులుగా ఉండటానికి పలువురు ఆసక్తితో ఉన్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డితో పాటు మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కలిశారని సమాచారం. కమిటీ చైర్‌పర్సన్‌గా వైశ్యుల సమాజిక వర్గానికి చెందిన మహిళ పేరు వినిపిస్తోంది. త్వరలో కొత్త కమిటీ నియామకం వల్ల మార్కెట్ యార్డులో రాజ్యమేలుతున్న సమస్యలకు ఫుల్‌స్టాప్ పడే అవకాశాలు ఉన్నాయి.

పుట్టపర్తిలో జీతం తాడిపత్రిలో ఉద్యోగం

తాడిపత్రి మార్కెట్ యార్డుకు ప్రధాన సెక్రటరీ పోస్టుతో పాటు అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులు ఉన్నాయి. ప్రధాన సెక్రటరీ పోస్టుకు రెగ్యులర్ అధికారిని 2021 నుంచి నియమించలేదు. 2021లో రెగ్యులర్ సెక్రటరీ వీరయ్య బదిలీ తరువాత కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన రూపకుమార్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆయన తరువాత అనంద్, ప్రస్తుతం రంగనాథ్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. అనంతపురంలో నివాసం ఉంటున్న రంగనాథ్ పుట్టపర్తి యార్కెట్ యార్డులో సెక్రటరీగా ఉంటున్నారు. ఇన్‌చార్జ్ సెక్రటరీ ఈ ఏడాది మార్చిలో రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో పుట్టపర్తిలో పనిచేస్తున్న రంగనాథ్‌ను తాడిపత్రి ఇన్‌చార్జ్‌గా నియమించారు. ప్రస్తుతం ఆయన పుట్టపర్తిలో జీతం తీసుకుంటూ తాడిపత్రిలో పూర్తిస్థాయిలో విధులకు అధికారులు నియమించారు.

> **ఆదాయం కోసం ప్రయత్నిస్తున్నాం**
>
> తాడిపత్రి మార్కెట్‌యార్డులో ఖాళీగా ఉన్న గోడౌన్లను రైతులకు ఉపయోగకరంగా మార్చుతాం. అదాయం పెంచడం కోసం ప్రయత్నిస్తున్నాం.గత ఏడాది ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్ కంటే ఎక్కువ అదాయం పెంచాం. మార్కెట్ యార్డులోని లోటుపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తా. అదాయ వనరులను గుర్తించే ప్రయత్నంలో ఉన్నా.
>
> – రంగనాథ్, మార్కెట్ యార్డు సెక్రటరీ

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి, నైరుతిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/గుత్తి రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సూచించారు. గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా మున్సిపాలిటీ, మండలంలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి న నేపథ్యంలో శనివారం పలువురు నాయకులు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను కలిశారు. గుంతకల్లు మండల పోలింగ్ బూత్ కమిటీ కన్వీనర్ నాగిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తలారి వెంటరాముడు, ఆదినారాయణ స్వామి, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు నాయక్, ఓబిరెడ్డి, సురేంద్ర తదితరులు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గుత్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సాయి నిరీక్షణ్‌రెడ్డి, అనూష్‌రెడ్డి, గురుహేమంత్‌రెడ్డి, గాదిలింగ, యాంగంటి, గోపాల్, వెంకట మోహన్‌రెడ్డి, దేవేంద్ర, రఘునాథరెడ్డి, లక్ష్మిరెడ్డి, మహాలింగ, హనుమంతురెడ్డి, ఓబుళయ్య తదితరులు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, నైరుతిరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అనుబంధ విభాగాల నాయకులు కృషి చేయాలన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు, రైతులను గాలికొదిలేసాడని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు కార్యకర్తలు కష్టపడాలని సూచించారు.

కూటమి వైఫల్యాలను వివరించండి



సమన్వయకర్త సాకే శైలజానాథ్‌ను కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న మండల కన్వీనర్లు

శింగనమల: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సమన్వయకర్త , మాజీ మంత్రి సాకే శైలజానాథ్ సూచించారు. శనివారం సాయంత్రం బుక్కరాయసముద్రం మండలంలోని దయ్యాలకుంటపల్లిలో నూతనంగా ఎంపికై న మండల కన్వీనర్లు పూల ప్రసాదు, వై.ఎల్లారెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్‌వలి ఖాన్, మహేశ్వర్‌రెడ్డి కలిసి సమన్వయకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. వారితో శైలజానాథ్ మాట్లాడుతూ మండలాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. త్వరలోనే గ్రామాల్లో పర్యటిద్దామని, గ్రామ స్థాయినుంచి పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పార్టీ అభివృద్ధికి కృషి

గార్లదిన్నె: గార్లదిన్నె మండలంలో వైఎస్సార్‌సీపీ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని మండల కన్వీనర్ ఎల్లారెడ్డి అన్నారు.శనివారం ఆయన మాట్లాడుతూ మండల కన్వీనర్‌గా తనను ఎంపిక చేస్తూ పార్టీ రాష్ట్ర అధిష్టానం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు.తనపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నియమించి నందుకు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శింగనమల నియో జ కవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు, కార్య కర్తలు ఎల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గం వాణిజ్య విభాగ అధ్యక్షుడు కొనిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన శైలజానాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పుట్లూరు: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా జంగంరెడ్డిపేటకు చెందిన పొన్నపాటి మహేశ్వరరెడ్డి ఎంపికపై మండలవ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జంగంరెడ్డిపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. మండలాధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్వరెడ్డిని సర్పంచ్ పొన్నపాటి రామాంజనరెడ్డి, సీనియర్ నాయకుడు మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, నాయకులు సుధకార్‌రెడ్డి, నరసింహారెడ్డి, మిద్దె నారాయణ స్వామి, పవన్‌కుమార్ తదితరులు అభినందించారు.

సమస్యలపై కౌన్సిలర్ల ధ్వజం



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ వన్నూర్‌బీ



సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్లు

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, మున్సిపల్ డీఈ హేమచంద్ర ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొదట కోరం లేక గంట పాటు వాయిదా వేశారు. మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లను ఫోన్‌లలో బతిమాలి రప్పించి ఎట్టకేలకు మధ్యాహ్నం 12.30 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభించారు. ప్రారంభంలోనే మున్సిపల్ వైస్ చైర్మన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు ఫరూక్, ఖాజా, వరదరాజులు, వాల్మీకి శివ తదితరులు పైకి లేచి పలు సమస్యలను లేవనెత్తారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, కుక్కలు, దోమల సమస్యలను వివరించారు. ప్రతి సమావేశంలో సమస్యలను తెలియజేస్తున్నా.. ఇంత వరకూ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. గాంధీ సర్కిల్ వద్ద నుంచి కోట వరకూ రోడ్డు వేస్తామని పలు మార్లు హామీలు ఇచ్చారని, ఎందుకు వేయలేదని మున్సిపల్ అధికారులను నిలదీశారు. సమస్యలను పరిష్కారం చేయకపోతే భవిష్యత్‌లో జరిగే కౌన్సిల్ సమావేశాలను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు.

రైళ్లపై నిఘా పెంచాలి




మాట్లాడుతున్న ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంతకల్లు: రైళ్లపై నిఘా పెంచాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. శనివారం స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో ఎస్‌సీఆర్ డీఆర్ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో వంతెన వివరాలతో పాటు చెరువులు, నదులు, డ్యామ్‌లకు సమీపంలో ఉన్న రైలు మార్గాలపై రైల్వే జీఎం ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ట్రాక్‌లు, వంతెనలు, భారీ వర్షాలు కురిసే మార్గాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. సిగ్నలింగ్ వ్యవస్థలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తకుండా జాగ్రత్తలను పాటించి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. లోటుపాట్లు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం రైలు కార్యకలాపాలను నిర్వహించడానికి సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

గుత్తి: గుత్తి జీఆర్‌పీ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రైలు ఢీ కొని చంద్ర అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. చంద్ర రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు రైలు ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అతడిని అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైలు దిగుతూ మహిళకు గాయాలు



గాయపడిన సుజాత

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అర్ధ రాత్రి సమయంలో రైలు దిగుతూ జారి పడి సుజాత అనే మహిళ తీవ్రంగా గాయపడింది. జీఆర్‌పీ పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బేతాపల్లికి చెందిన సుజాత పని మీద పుట్టపర్తికి వెళ్లింది. తిరిగి రైల్లో సొంత ఊరికి బయలుదేరింది. గుత్తి రైల్లో స్టేషన్‌లో రైలు దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధిక శాతం మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో ఎంపీపీ మండిపడ్డారు. ఎంపీపీ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు గంట సేపు సమయం కేటాయించలేకపోతున్నారంటే ఇక ప్రజా సమస్యలపై వారు ఎంత నిబద్ధతగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను అధికారులు పరిష్కరించాలని, అలాంటిది అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఎంపీపీ తీవ్రంగా మందలించారు. మండల సమావేశం కంటే ముఖ్య పనులు ఏమున్నాయన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్‌లు గ్రామాల్లోని పలు సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, వైస్ ఎంపీపీలు తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, సర్పంచ్‌లు గోపాల్, వాసుదేవరెడ్డి, మస్తాన్, వెంకటేష్, ఆంజనేయులు, లావణ్య, ఎంపీటీసీ సుమలత, ఈఓఆర్డీ నరశింహారెడ్డి, ఏపీఓ రమేష్, ఎక్సైజ్ ఎస్ఐ అస్లాం బేగ్ పాల్గొన్నారు.

విద్యార్థులు తీపి అన్నం తినరంట..!



220 మంది విద్యార్థులకు చిన్న పాత్రలో తయారు చేసిన బెల్లం అన్నం



టీచర్ పర్యవేక్షణ లేకుండా విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: తీపి అన్నం విద్యార్థులు తినరంటూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులు కొత్త భాష్యం చెబుతున్నారు. వివరాలు.. పట్టణం సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో ఉన్న ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ కరువైంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 220 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా శనివారం అన్నం, రసంతో పాటు తీపి అన్నం చేశారు. తీపి అన్నం చేసిన పాత్ర చూస్తే అంతమంది విద్యార్థులకు సరిపోతుందా? అన్న అనుమానం వస్తుంది. దీనిపై వడ్డించే వారిని అడిగితే ఎక్కువమంది విద్యార్థులు తీపి అన్నం తినరని, దీంతో తక్కువగా వండామని చెప్పుకొచ్చారు. టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో పలువురు విద్యార్థులు మధ్యాహ్న భోజనం పట్ల విద్యార్థులు విముఖతతో ఇళ్లకు వెళ్లి భోజనం చేసి తరగతులకు హాజరవుతున్నారు. ఉపాధ్యాయులు స్పందించి మధ్యాహ్న భోజనం నాణ్యతగా వండేలా చూసి, విద్యార్థులు పాఠశాలలోనే తినేలా చూడాలని తల్లిదండ్రులు కోరారు.

క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలి

గుత్తి: గుత్తి రైల్వే డీజిల్‌షెడ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కేజీ రామచంద్రకు అవకాశం లేకుండా చేసిన క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున నేతృత్వంలో సభ్యులు శనివారం గుత్తిలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రైల్వే డీజిల్‌షెడ్ ఎన్నికలు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయన్నారు. కేజీ రామచంద్రకు సభ్యత్వం ఉందన్నారు.అయినప్పటికీ అతను పోటీ చేయకుండా క్లర్క్ అడ్డు పడుతున్నారన్నారు. కేజీ రామచంద్రకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కుల వివక్షత చూపుతున్నారని మండి పడ్డారు. కార్యక్రమంలో కేవీపీఎస్ సభ్యులు రామాంజనేయులు, నారాయణస్వామి, రమేష్, రంగస్వామి, ఓబులేసు, రాము తదితరులు పాల్గొన్నారు.

బండలతో కాలువ మూసివేత



మురికి కాలువను బండలతో మూసివేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలోని సిమెంట్ రోడ్డుకు ఉన్న మురికి కాలువ పైభాగం శనివారం బండలతో మూసివేశారు. 'అదుపు తప్పితే అంతే సంగతులు' అంటూ సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. వెంటనే ప్రమాదకరంగా ఉన్న కాలువపై బండలతో మూసివేశారు. సమస్య పరిష్కారమవడంతో వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి



ఎన్‌ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డిని కలసిన జిల్లా అధికార ప్రతినిధి పద్మావతి

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి పద్మావతి అన్నారు. యల్లనూరు మండలం చింతకాయమంద గ్రామానికి చెందిన ఆమెకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె తన భర్త సంజీవరాయుడుతో కలిసి శనివారం ఎస్ఆర్ఐటీ కాలేజీలో ఎన్‌ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డితో భేటీ అయ్యారు. పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేస్తామన్నారు. అనంతరం జిల్లా ప్రస్తుత పరిస్థితులపై సాంబశివారెడ్డితో కాసేపు చర్చించారు. కార్యక్రమంలో మాజీ ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, నాగరంగయ్య పాల్గొన్నారు.

'అధిక ధరలకు స్టాంపుల విక్రయం'

గుంతకల్లు: అధిక ధరలకు స్టాంపులు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర, సురేంద్రబాబు మాట్లాడుతూ జిల్లాలో ఓ వైపు నకిలీ స్టాంపుల కలకలం..మరో వైపు అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న స్టాంప్ వెండర్ల లైసెన్సను రద్దు చేయాలన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్ బాండ్ పేపర్ల కొరత సృష్టించి కేవలం ప్రైవేట్ వెండర్స్ వద్ద స్టాంపులు దొరికేలా చేస్తున్నారన్నారు. దీంతో సామాన్య ప్రజలు బాండ్ పేపర్లు దొరక్క రెట్టింపు రేట్లు చెల్లించి కొనుగోలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వంశీ, రంగా, ఆది, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


గేట్స్ విద్యార్థులకు ఎంఎస్ఎంఈ ఫండింగ్

గుత్తి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎస్ఎంఈ ఫండింగ్‌కు గేట్స్ కాలేజీ విద్యార్థులు అర్హత సాధించారు. నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి , వినూత్న ఆలోచనలను వాస్తవ ప్రపంచ పరిష్కారాలుగా మార్చడానికి ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 4.0 కార్యక్రమాన్ని చేపట్టింది. దేశంలోని లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ఐడియాలను సమర్పించారు. ఈ ఐడియాలలో దేశ వ్యాప్తంగా 488, ఆంధ్రప్రదేశ్‌లో 47 సెలెక్ట్ అయ్యాయి. ఇందులో కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అనేక మంది విద్యార్థులు ఐడియాలు పంపారు. అయితే గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు పంపిన రెండు ఐడియాలు సెలెక్ట్ కావడం గమనార్హం. ఎంఎస్ఎంఈ ఫండింగ్‌కు విద్యార్థులు ఎంపిక కావడంతో గేట్స్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఐడియాలు సమర్పించిన విద్యార్థులను అభినందించారు.

ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉండండి

పెద్దవడుగూరు: ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి సూచించారు. శనివారం మండలంలోని దిమ్మగుడి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. గ్రామంలో మొహర్రం పండుగ నిర్వహణ విషయమై చర్చించారు. శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే సహించబోమని హెచ్చరించారు. సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రామకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుత్తి: పట్టణంలోని 20వ వార్డులో నివాసముండే వైఎస్సార్‌సీపీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ కేవీ రమణ తండ్రి రామకృష్ణ శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ తాజా, మాజీ కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, పీరా, కౌన్సిలర్లు రామకృష్ణ ఇంటికి వెళ్లారు. రామకృష్ణ మృత దేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.